ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
Bullet Edition
బుధవారం 19-06-2024
4 PM

గన్‌తో బెదిరించి పలుమార్లు లైంగికదాడి

ఎవరికైనా చెప్తే చంపేస్తానంటూ బెదిరింపులు

ఎస్పీకి ఫిర్యాదు చేసిన బాధితురాలు

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసిన ఉన్నతాధికారులు

ఘటనపై సీరియస్‌గా స్పందించిన తెలంగాణ సర్కార్

311 ఆర్టికల్ ప్రకారం సర్వీస్ నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు

గతంలోనూ ఎస్సైపై లైంగిక ఆరోపణలు

సస్పెన్షన్‌కు గురైనప్పటికీ మారని బుద్ధి..

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఘటన

# పాపం పండింది !

## కీచక ఎస్సై ఉద్యోగం ఊడింది

### మహిళా కానిస్టేబుల్‌పై కన్నేసిన కాళేశ్వరం ఎస్సై భవానీసేన్



వరంగల్, జూన్ 19 (ప్రజాస్వరం): ప్రజలను రక్షించే రక్షకభటులకే రక్షణ లేకుండాపోతోంది. మహిళా పోలీసులపై కొందరు ఉన్నతాధికారుల వేధింపులు నిత్యకృత్యమయ్యాయి. కామాంధులు బరితెగించి వారిపై అఘాయిత్యాలకు ఒడిగడుతున్నారు. అధికారాన్ని అడ్డంపెట్టుకొని రాక్షసంగా ప్రవర్తిస్తున్నారు. తాజాగా.. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఇలాంటి దారుణ ఘటన వెలుగు చూసింది. ఎస్సై తన అధికారాన్ని అడ్డం పెట్టుకొని మహిళా కానిస్టేబుల్‌పై పలుమార్లు అఘాయిత్యానికి పాల్పడ్డాడు. గన్‌తో బెదిరించి ఆమెపై వరుసగా అత్యాచారం చేశాడు. ఈ ఘటన పోలీసు వర్గాల్లో తీవ్ర సంచలనంగా మారింది. వివరాల్లోకి వెళితే.. భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం పోలీసు స్టేషన్‌లో ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న భవానీ సేన్ స్టేషన్‌లో పని చేస్తున్న ఓ మహిళా కానిస్టేబుల్‌పై కన్నేశాడు. ఆమెపై పలుమార్లు లైంగికదాడి చేశాడు. ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించాడు. ఈ మేరకు బాధితురాలు ధైర్యంచేసి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్సై బాగోతం బట్టబయలైంది. ఎస్‌ఐ భవానీ సేన్ గత కొన్ని నెలలుగా తనను వేధిస్తున్నట్లు బాధితురాలైన మహిళా కానిస్టేబుల్ పోలీసు ఉన్నతాధికారులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. విధుల్లో ఉన్న తనపై పలుమార్లు అత్యాచారం చేసినట్లు ఆరోపించింది. ఈ విషయం ఎవరికైనా చెబితే చంపేస్తానని ఎస్‌ఐ గన్‌తో బెదిరించినట్లు వాపోయింది. ఎస్పీని కలిసి బాధితురాలు తన గోడును వెళ్లగక్కింది. మహిళా కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన ఉన్నతాధికారులు ఎస్‌ఐ భవానీ సేన్‌పై చర్యలు తీసుకున్నారు. కాళేశ్వరం పోలీస్ స్టేషన్‌లో గత అర్ధరాత్రి ఇద్దరు డీఎస్పీలు, సీఐలతో విచారణ చేపట్టి అతడిని అదుపులోకి తీసుకున్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కింద కేసులు నమోదు చేశారు. అయితే గతంలో ఆదిలాబాద్ జిల్లాలో పనిచేసినప్పుడూ సదరు ఎస్సై భవానీసేన్ ఓ యువతితో అసభ్యంగా ప్రవర్తించి సస్పెండ్ అయ్యాడు.

### ఎక్కడ పనిచేసినా అంతే..

కాళేశ్వరం ఎస్సై భవానీసేన్‌కు స్త్రీలోలుడిగా, కామాంధుడిగా డిపార్ట్‌మెంట్‌లో పేరుంది. ఆయన ఎక్కడ విధులు నిర్వహించినా అక్కడ మహిళా సిబ్బందితో అమర్యాదగా, వంకరగా మాట్లాడుతాడనే టాక్ ఉంది. గతంలో ఆదిలాబాద్ జిల్లా రెబ్బన పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా పనిచేసిన సమయంలో స్టడీ మెటీరియల్ ఇప్పిస్తానని ఓ యువతిని నమ్మించి స్టేషన్‌కు తిప్పించుకుని లైంగికంగా వేధించారనే ఆరోపణలు ఉన్నాయి. సదరు యువతి ఫిర్యాదు మేరకు ఉన్తాధ◌ికారులు ఎస్సైపై సస్పెన్షన్ వేటు వేశారు. ఈక్రమంలోనే కాళేశ్వరం ఎస్సైగా బాధ్యతలు తీసుకున్న భవానీసేన్ తన తీరు మార్చుకోలేదు. ఇక్కడ కూడా స్టేషన్‌కు వచ్చే మహిళలతో అసభ్యంగా మాట్లాడటం, స్టేషన్‌లో విధులు నిర్వహించే మహిళా సిబ్బందిపై వేధింపులకు గురిచేయడం పరిపాటిగా మారిందనే ఆరోపణలు ఉన్నాయి. తాజాగా తనపై ఎస్సై అత్యాచారానికి పాల్పడుతున్నాడని మహిళా కానిస్టేబుల్ ఫిర్యాదు చేయడం కలకలంరేపింది. ఉన్నతాధికారులు స్పందించి ఎస్సై భవానీసేన్‌ను విధుల నుంచి సస్పెండ్‌చేసి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకోవడం డిపార్ట్‌మెంట్‌లో తీవ్ర చర్చనీయాంశం అవుతోంది.

### సీఎం సీరియస్.. సర్వీస్ నుంచి తొలగింపు

లైంగిక వేధింపుల కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న కాళేశ్వరం ఎస్‌ఐ వ్యవహారంపై సీఎం సీరియస్ అయ్యారు. ఎస్సై భవాని సేన్ ను సర్వీస్ నుంచి డిస్మిస్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మహిళా కానిస్టేబుల్‌ను లైంగికంగా వేధించినట్లు నిర్ధారణ కావడంతో సీఎం రేవంత్ సీరియస్ యాక్షన్ తీసుకున్నారు. పూర్తిస్థాయి విచారణలో భాగంగా ఉన్నతాధికారులు నిన్న రాత్రి ఎస్సై వద్ద నుంచి సర్వీస్ రివాల్వర్ స్వాధీనం చేసుకున్నారు. ఇవాళ 311 ఆర్టికల్ ప్రకారం సర్వీస్ నుంచి తొలగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేయడం గమనార్హం.



## శ్రీచైతన్య పాఠశాల ముందు ధర్నా..

పేట్ బషీరాబాద్, జూన్ 19 (ప్రజాస్వరం): అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేస్తున్న శ్రీచైతన్య స్కూళ్ల ముందు బడ్జెట్ పాఠశాల యాజమాన్యాలు ధర్నా నిర్వహించాయి. కుత్బుల్లాపూర్ మండలం సుచిత్ర మూడుగుళ్ళ ఎదురుగా ఉన్న శ్రీ చైతన్య పాఠశాలకు అనుమతులు లేకపోవడంతో మేనెలలో విద్యాశాఖ అధికారులు సీజ్ చేశారు. అయినప్పటికీ పాఠశాల యాజమాన్యం అడ్మిషన్ స్వీకరిస్తూ విద్యార్థులను చేర్చుకుంటోంది. ఈ విషయంపై ఇప్పటికే ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాలు కోర్టును ఆశ్రయించాయి. అయితే బుధవారం నుంచి పాఠశాల ప్రారంభం చేస్తున్నామంటూ స్కూల్ మెసేజ్లు పెట్టడంతో కుత్బుల్లాపూర్ బడ్జెట్ స్కూల్ యాజమాన్య సంఘం పాఠశాల ముందు ధర్నా నిర్వహించాయి. ఈ సందర్భంగా శ్రీ చైతన్య స్కూల్ వైఖరిని ఎండకట్టారు.

## బాధ్యతలు స్వీకరించిన పవన్ కళ్యాణ్



### ఏపీ డిప్యూటీ సీఎంను అభినందించిన ప్రముఖులు

అమరావతి, జూన్ 19 (ప్రజాస్వరం): ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రిగా జనసేన అధినేత పవన్ కల్యాణ్ బాధ్యతలు స్వీకరించారు. విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం ఉదయం విధులు చేపట్టారు. అలాగే పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఆర్‌డబ్ల్యూఎస్, పర్యావరణ, శాస్త్రసాంకేతిక, అటవీ శాఖ మంత్రిగా ఆయన బాధ్యతలు చేపట్టారు. పలు దస్త్రాలపై సంతకాలు చేశారు. అనంతరం సోదరుడు నాగబాబు, వివిధ శాఖల అధికారులు, ఎమ్మెల్యేలు, నేతలు పవన్‌కు అభినందనలు తెలిపారు.

## ఏసీపీపై చర్యలు తీసుకోవాలని మందుడబ్బాతో రైతు ఆందోళన



పెద్దపల్లి, జూన్ 19 (ప్రజాస్వరం): డబ్బులివ్వకుండానే భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకున్న పెద్దపల్లి ఏసీపీపై చర్యలు తీసుకోవాలని ఓ వృద్ధుడు పురుగుల మందు డబ్బాతో ధర్నాచేపట్టాడు. టేకుమట్ల - ఆరెపల్లి గ్రామానికి ఇటుకాల రాయమల్లుకు 39 గుంటల భూమి ఉంది. రూ.13.65 లక్షలకు పెద్దపల్లి ఏసీపీగా విధులు నిర్వర్తిస్తున్న అదే గ్రామానికి చెందిన గజ్జి కృష్ణ తన భార్య రాధిక పేరుతో కొనుగోలు చేశారు. ఒప్పందం ప్రకారం మొదట రూ.7 లక్షలు చెల్లించి, రిజిస్ట్రేషన్ సమయంలో రూ. 6.65 లక్షలు ఇవ్వాల్సి ఉంది. కాగా, రిజిస్ట్రేషన్ రోజు డబ్బులు ఇవ్వాల్సి ఉండగా, అక్కడ ఇవ్వకుండా ఇంటికి వచ్చి ఇస్తామని చెప్పాడు. బోర్ రిపేర్ చేసిన తర్వాతనే అన్ని డబ్బులు ముట్టచెప్తానని వెళ్లిపోయారు. తనకు రావాల్సిన డబ్బులు ఇవ్వకుండా తిప్పుకుంటున్నాడని వృద్ధుడు ఆవేదన వ్యక్తంచేశాడు. పోలీసులు, ఎమ్మెల్యేకు చెప్పినా పట్టించుకోవడం లేదనే ఆవేదనతో.. బంధువులతో కలిసి పురుగుల మందు డబ్బాతో వృద్ధుడి ధర్నాచేపట్టారు. టేకుమట్ల మండల రైతులు, ప్రజలు ఆయనకు మద్దతు పలికారు.

## 21న కేబినెట్ భేటీ !

హైదరాబాద్, జూన్ 19 (ప్రజాస్వరం): ఈనెల 21న రాష్ట్ర మంత్రిమండలి సమావేశం జరగనున్నట్లు తెలిసింది. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సమావేశాన్ని సచివాలయంలో నిర్వహించనున్నారు. ఇందులో ప్రధానంగా అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు, ఆగస్టు 15 నాటికి అమలు చేయబోయే పంట రుణాల మాఫీ పథకంపై చర్చించనున్నారు. రుణ మాఫీ పథకం అమలుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటున్న సంగతి తెలిసిందే. అవసరమైన నిధులను సేకరణపై దృష్టి పెట్టిన ప్రభుత్వం, విధి విధానాలను కూడా ఖరారు చేయబోతోంది. పథకానికి ఎప్పటి నుంచి కట్ ఆఫ్ డేట్‌ను నిర్ణయించాలి, ఇంకా ఎలాంటి నిబంధనలు విధించాలన్నదానిపై కసరత్తు చేస్తోంది. దీనిపై ఈ భేటీలో కూలంకషంగా చర్చించి, మంత్రుల అభిప్రాయాలను తెలుసుకోనుంది. అసెంబ్లీ వర్షాకాల సమావేశాలను నిర్వహించాల్సి ఉన్నందున ప్రారంభ తేదీని ఖరారు చేయనుంది.



## చిరంజీవి మాజీ అల్లుడు కన్నుమూత

- **అనారోగ్యంతో శ్రీజ మాజీ భర్త శిరీష్ కన్నుమూత**

హైదరాబాద్, జూన్ 19 (ప్రజాస్వరం): మెగాస్టార్ చిరంజీవి చిన్న కూతురు శ్రీజ మాజీ భర్త శిరీష్ భరద్వాజ్ కన్నుమూశారు. గత కొద్ది కాలంగా ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్నారు. ఆరోగ్యం విషమించి బుధవారం ఉదయం హైదరాబాద్‌లోని ప్రముఖ హాస్పిటల్‌లో మరణించారు. శిరీష్ మరణంతో ఆయన స్నేహితులు, సన్నిహితులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. 2007లో శిరీష్ భరద్వాజ్ శ్రీజను ప్రేమ వివాహం చేసుకున్నారు. పెద్దలకు తెలియకుండా జరిగిన ఈ వివాహం అప్పట్లో తీవ్ర సంచలనం, వివాదం సృష్టించింది. అనంతరం వీరి మధ్య విభేదాలు రావడంతో 2014లో చట్టబద్ధంగా విడాకులు తీసుకున్నారు. 2016లో శ్రీజ కళ్యాణ్‌ను వివాహమాడారు. శిరీష్ - శ్రీజ జంటకు ఒక పాప ఉండగా.. వారు విడాకులు తీసుకున్న తర్వాత పాప శ్రీజ వద్దే ఉంటోంది. అయితే శ్రీజ నుంచి విడాకులు తీసుకొన్న తర్వాత శిరీష్ మరో అమ్మాయిని వివాహం చేసుకొని తన జీవితాన్ని కొనసాగిస్తున్నారు. లాయర్ వృత్తిలో ఉన్న ఆయన కొన్ని సంవత్సరాల క్రితం బీజేపీలో చేరారు.



## అధ్యాపకులు వేధిస్తున్నారంటూ ఆందోళన

- **బీజేపీ ఎంపీ ఈటల మెడికల్ కాలేజీలో ఘటన**

సిద్దిపేట, జూన్ 19 (ప్రజాస్వరం): అధ్యాపకులు వేధిస్తున్నారంటూ ఆర్‌వీఎం మెడికల్ కాలేజీ విద్యార్థినులు ఆందోళనకు దిగారు. సిద్ధిపేట జిల్లా ములుగు మండలంలోని ఆర్‌వీఎం మెడికల్ కళాశాలలో తమను అధ్యాపకులు దుర్భాషలాడుతూ, బయటకు చెప్పుకోలేని విధంగా మాట్లాడుతూ మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని విద్యార్థినులు కన్నీళ్ళు పెట్టుకున్నారు. తమ ఫోన్లను తీసుకొని డేటాను చెక్ చేస్తున్నారని, ఓవర్ డ్యూటీలు వేస్తూ.. సెలవు ఉన్నా సెలవులు ఇవ్వకుండా తమకు మానసికంగా ఇబ్బందులు పెడుతున్నారని వాపోయారు. ఈ అధ్యాపకులను తొలగించి వేరే అధ్యాపకులను నియమించాలని విద్యార్థినులు కోరారు.